






పుష్కరిణిలో చక్రత్తాళారును మునక వేయించిన అర్చకులు, టీటీడీ ఈవో, అదనపు ఈవో తదితరులు - ఆలయంలో గరుడపటాన్ని కిందకు దించుతున్న అర్చకులు

# బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

## ● శనివారం ఉదయం చక్రస్నానం.. రాత్రి ధ్వజావరోహణం

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి జరిగిన చివరి ఘట్టమైన ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల మొదటిరోజు ధ్వజారోహణం సందర్భంగా గరుడాళ్వార్ ఆహ్వానించిన దేవతలను తిరిగి పంపే కార్యక్రమాన్నే ధ్వజావరోహణం అంటారు. ఈ సందర్భంలోనే తిరిగి వచ్చే బ్రహ్మోత్సవాలకు రావాలని గరుడాళ్వార్ దేవతలను కోరతారని పురాణోక్తి. చివరి రోజైన శనివారం సాయంత్రం ఏడు గంటలకు ఉభయ దేవేరుల సమేతంగా స్వామివారిని బంగారు తిరుచ్చిలో తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభం వద్దకు వేంచేపుచేశారు. రాత్రి 9 గంటలకు అర్చకస్వాములు పూజాధికార్యక్రమాలు నిర్వహించి ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. అనంతరం ధ్వజపడి నివేదన కావించి, ఆలయంలోని బంగారువాకిలిలో ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.

### వేడుకగా చక్రస్నానం

శనివారం ఉదయం ఆలయం నుంచి ఉత్సవర్లను తిరుచ్చిలో, చక్రత్తాళ్వార్‌ను పల్లకీలో తిరుమాడ వీధుల్లో ఊరేగింపుగా వరాహస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం, ఇత్యాది కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత చక్రత్తాళ్వార్‌ను అర్చకస్వాములు పుష్కరిణిలో మూడుమునకలు వేయించారు. పుష్కరిణిలో అప్పటికే వేచివున్న వేలాదిమంది భక్తులు గోవింద నామస్మరణలతో స్నానమాచరించారు. అనంతరం ఉత్సవర్లను పల్లకీలో ఆలయం ఆలయానికి వేంచేపు చేశారు. పుష్కరిణి సామర్థ్యం తక్కువగా ఉండే నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో భక్తులను విడదల వారీగా లోపలకు అనుమతించారు. దీంతో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకోలేదు. పుష్కరిణి చుట్టూ పోలీసు, భద్రతా, ఇతర బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడంతో చక్రస్నానం సాఫీగా సాగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, రవినాథ్‌తిల్హరి, నందమూరి వసుంధరదేవి, జన సేన పార్టీ నేత పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణి చుట్టూ ఉన్న భక్తులు

## సమష్టి కృషితో విజయవంతం

### అధికారులంతా కొత్తయినా.. ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సలక సౌకర్యాలతో భక్తులను వాహనసేవలను కనులారా తిలకించారు. అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో తొమ్మిదిరోజుల ఉత్సవాలు విజయవంతంగా సాగాయి. ఈనెల 4వ తేదీన మొదలైన బ్రహ్మోత్సవాల్లో సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రూ.13.45 కోట్లతో నిర్మించిన వకుళామాత సెంట్రల్ కిచెన్‌ను మరుసటి రోజు ప్రారంభించారు. ఇక, ఉత్సవాల్లో తొలి నాలుగు రోజులు భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నా.. ఐదవ రోజు గరుడ సేవకు దాదాపు ఐదేళ్ల తర్వాత విపరీత రద్దీ కనిపించింది. రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలోని అదనపు క్యూలైన్ల ప్రవేశంలో గంట పాటు భక్తుల మధ్య తోపులాటలు మినహా.. అంతా ప్రశాంతంగా ముగిసింది. జేఈవో వీరబ్రహ్మం మినహా ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్వో శ్రీధర్ బ్రహ్మోత్సవాలకు కొత్తే అయినప్పటికీ.. ముందస్తు ప్రణాళిక, సమష్టి కృషితో మంచి ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. ఈ ఏడాది కళాబృందాల ప్రదర్శనలు చాలా సాధారణంగా జరిగాయి. పెద్దగా మెప్పించలేకపోయారనే భావన వ్యక్తమైంది. దీంతో వచ్చే బ్రహ్మోత్సవాలకు ఉత్సాహవంతులు.. వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ, ప్రముఖ కళాబృందాలను తీసుకురావాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎప్పటిలానే ఈసారి కూడా విద్యుత్, పుష్పాలంకరణలు భక్తులను మెప్పించాయి. మరోవైపు ఈసారి పోలీసుల బందోబస్తు భారీగా కనిపించింది.



చక్రస్నానం సందర్భంగా పుష్కరిణిలోకి వస్తున్న భక్తులు

### కనిపించని వీఐపీల హడావుడి

ఈసారి ఉత్సవాల్లో వీఐపీల హడావుడి లేకుండా వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి. సీఎం పర్యటనలోనూ పెద్దగా రాజకీయ ప్రముఖులు కనిపించలేదు. తొమ్మిదిరోజుల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు బీవీఎల్ఎన్ చక్రవర్తి, గోపాలకృష్ణారావు, రవినాథ్ తిల్హరి, జ్యోతిర్మయి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, నందమూరి వసుంధరాదేవి మాత్రమే వాహనసేవల్లో పాల్గొన్నారు.

### ఈ'సారీ' మరుగుదొడ్ల సమస్య

ముందస్తు ప్రణాళికతో ఎన్ని ఏర్పాట్లు చేసినా.. ఈసారి కూడా మాడవీధుల్లో మరుగుదొడ్ల విషయంలో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తాయి. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, విరిగిపోయిన పైపులు, నీటి కొరత, దుర్వాసనతో గరుడసేవ రోజున భక్తులు ఇబ్బంది పడ్డారు. వీటిని గుర్తించిన అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా యోచిస్తున్నారు. గ్యాలరీల విస్తరణపైనా దృష్టిపెట్టారు.



## రాజరాజేశ్వరిదేవిగా బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, అక్టోబరు 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవంలో చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని రెండు చేతుల్లో శంఖు చక్రాలు, మరో చేతిలో చిలుక, ఇంకో చేతిలో చెరకు గడలతో చతుర్భుజాలతో రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. డార్మెటరీ హాలులో ఉత్సవమూర్తిని ఉంచి, కలశ స్థాపన చేశాక ఉభయదారులతో మూల మంత్రాన్ని పఠింపజేశారు. హోమాలు పూర్తయ్యాక ఉభయదారులకు ఆలయ ఈవో ఏకాంబరం అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందించారు. ఉభయదారులుగా వాయల్పాడుకు చెందిన శ్రీదేవి, రఘురామిరెడ్డి, వంశీప్రియ, సౌమిత్ రెడ్డి, కడపకు చెందిన దుర్గ, చంద్రశేఖర్‌రెడ్డి, పులిచెర్లకు చెందిన స్వర్ణ, మురళీమోహన్, దేదీప్యరెడ్డి, మోహన్‌సుభాష్‌రెడ్డి, తిరుపతికి చెందిన వెన్నెల, నాగరాజనాయుడు, మదనపల్లెకు చెందిన కన్యాకుమారి, మురళీబాబు, కవిత, రఘుపతి, అశ్విని, ఈశ్వర్‌కుమార్, మంజునాథ్, పుంగనూరు ఆశారాణి, మునిరాజ్, మంజుల, నటరాజ్, కుసుమకుమారి, దేవేంద్ర, బెంగళూరుకు చెందిన ప్రదీప్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కాగా, భక్తుల అన్నదానం కోసం రూ.1,01116ను వాయల్పాడుకు చెందిన రఘురామిరెడ్డి విరాళంగా ఇచ్చారు.

## నేడు, రేపు, ఎల్లుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

### ఇబ్బందులెదురైతే 94910 77356 నెంబరుకు ఫోన్ చేయండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13: వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలిచ్చారు. అందరూ ప్రధాన కార్య స్థానాల్లోనే అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 94910 77356 నెంబరు కేటాయించామన్నారు. ప్రజలకు ఇబ్బందులెదురైతే ఈ నెంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలపాటు పనిచేసేలా సిబ్బందికి విధులు నియమించామన్నారు. ప్రధానంగా జిల్లా నుంచి మండలస్థాయి వరకు అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ.. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## 'పీజీఆర్ఎస్' రేపటికి వాయిదా

చిత్తూరు, అక్టోబరు 13: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల రీత్యా సోమవారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌కు వచ్చే బాధితులు దీన్ని గమనించాలని కోరారు.

### ఎస్పీ కార్యాలయంలోనూ..

ఎస్పీ కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని మంగళవారానికి మార్చినట్లు ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు.

# 'కిక్కు' లక్కు ఎవరికో?

## నేడే చిత్తూరులో లాటరీ



ఆర్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి

### 104 మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు 2,266

చిత్తూరు సిటీ, అక్టోబరు 13: జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. 104 మద్యం దుకాణాలకు 2,266 దరఖాస్తులు వచ్చాయి. కేవలం దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ.45.32 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించే చిత్తూరు- కాణిపాకం రోడ్డులోని సంతపేటలో ఉన్న ఆర్ఆర్ గార్డెన్స్ (మాణిక్యమ్మ ఫంక్షన్ హాల్)ను కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్, ఈఎస్ శ్రీనివాస్‌కు నిర్వహణపై సూచనలిచ్చారు. అలాగే లాటరీ ప్రక్రియ కోసం రెవెన్యూ విభాగం నుంచి 18 మంది (10 మంది తహసీల్దార్లు, 8 మంది సూపరింటెండెంట్లు) ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

**7 గంటలకంతా వేదిక వద్దకు చేరుకోవాలి**

సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు లాటరీ నిర్వహిస్తారు. దరఖాస్తుదారులు ఉదయం ఏడు గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలి.

**దరఖాస్తుల వివరాలు**

| ఎక్సైజ్ స్టేషన్ | దుకాణాలు | దరఖాస్తులు |
|---|---|---|
| చిత్తూరు అర్బన్ | 22 | 569 |
| చిత్తూరు రూరల్ | 19 | 464 |
| కార్వేటినగరం | 8 | 294 |
| నగరి | 11 | 221 |
| పుంగనూరు | 14 | 158 |
| పలమనేరు | 13 | 170 |
| కుప్పం | 10 | 321 |
| పులిచెర్ల | 7 | 69 |

**రాష్ట్ర సరిహద్దుల్లోని దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ**

రాష్ట్ర సరిహద్దులోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తాయి. అత్యధికంగా పాలసముద్రం మండలానికి కేటాయించిన ఒకే ఒక్క మద్యం దుకాణానికి 82 దరఖాస్తులు వచ్చాయి. మండలాల వారీగా.. గుడిపాలలో రెండు దుకాణాలకు 36, 32, యాదమరిలో మూడు దుకాణాలకు 27, 43, 27, వెదురుకుప్పంలో రెండు దుకాణాలకు 37,34 , విజయపురంలో నాలుగు దుకాణాలకు 33, 28, 35, 28 దరఖాస్తులు, కుప్పంలో ఐదు దుకాణాలకు 31, 32, 37, 31, 35 దరఖాస్తులు, గుడుపల్లెలో ఒక దుకాణానికి 40 దరఖాస్తులు వచ్చాయి.

## ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దోపిడీ!

చిత్తూరు సిటీ, అక్టోబరు 13: ప్రభుత్వ మద్యం దుకాణాలకు సోమవారంతో గడువు ముగియనుంది. దీంతో ఈ దుకాణాల్లో రెండ్రోజులుగా మద్యాన్ని అధిక ధరలకు అమ్ముతూ దోపిడీ చేస్తున్నారని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎలైట్ షోరూంలో ఫుల్ బాటిల్‌పై రూ.80 అధికంగా వసూలు చేశారని, మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.20, ఆఫ్ బాటిల్‌పై రూ.40, ఫుల్ బాటిల్‌పై రూ.60 అదనంగా తీసుకున్నారని వాపోయారు. నూతన ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాట్లలో ఎక్సైజ్ అధికారులు ఉండటంతో వీరు అధిక ధరలకు విక్రయించినట్లు సమాచారం.

## మాకు తెలియకుండా వి.కోటలో దుకాణం నడపగలవా?

### టీడీపీకే చెందిన దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తెలుగు తమ్ముళ్ల బెదిరింపు

చిత్తూరు, అక్టోబరు 13: 'మాకు తెలియకుండా వి.కోటలో దుకాణం నడపగలవా' అంటూ టీడీపీకే చెందిన ఓ దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తెలుగు తమ్ముళ్లు బెదిరింపులకు దిగారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వి.కోటలో మూడు దుకాణాలకు టీడీపీ నేత, బంగారుపాళ్యం మండలంలోని 170 గొల్లపల్లె సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు దరఖాస్తు చేసుకున్నారు. ఇది తెలుసుకున్న కొందరు తెలుగు తమ్ముళ్లు ఆదివారం రాత్రి ప్రకాష్ నాయుడికి ఫోన్ చేశారు. తాము వి.కోటకు చెందినవారమని పరిచయం చేసుకున్నారు. ఆపై తిట్లదండకం అందుకున్నారు. 'మాకు తెలియకుండా వి.కోటలో ఎందుకు టెండర్ వేశావు? నీకు దుకాణం వస్తే మా లోకల్ నాయకుల అనుమతి లేకుండా షాపు నడపగలవా? అందుకే ముందే చెబుతున్నాం. నువ్వు రేపు జరిగే లాటరీలో పాల్గొనొద్దు' అంటూ హెచ్చరించారు. తాను కూడా టీడీపీకి చెందిన వ్యక్తినేనని ప్రకాష్ నాయుడు చెబుతున్నా..పలుమార్లు ఫోన్ చేస్తూ.. 'నీ అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. 'ఎవరైనా ఎక్కడన్నా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ఇచ్చిన జీవోలో ఉంది. నేను వి.కోటలో మూడు దుకాణాలకు రూ.6లక్షలు కట్టా. ఆ డబ్బు ఇచ్చేస్తే లాటరీలో దుకాణం వచ్చినా మీకే ఇస్తా' అని ప్రకాష్ నాయుడు చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో ఈ విషయాన్ని తాను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతానని ఆయన తెలిపారు.

## పుంగనూరులో కిలో టమోటా రూ.60



పుంగనూరు, అక్టోబరు 13: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం కిలో టమోటా ధర రూ.60 పలికింది. కిలో ధర రెండో రకం రూ.56.40, మూడోరకం రూ.52.70 చొప్పున విక్రయాలు జరిగాయి. మార్కెట్‌కు 20.61 టన్నుల టమోటా వచ్చిందని వ్యాపారులు తెలిపారు.

# చిత్తూరు నగరంలో ఉద్రిక్తత





చర్చి వీధిలో కొంతమేరకు కూల్చేసిన పాత భవనం, సీఐతో మాట్లాడుతున్న కటారి హేమలత, గుమికూడిన జనం

- చర్చివీధిలో ఓ పాత భవనాన్ని కూల్చబోతుండగా చెలరేగిన వివాదం
- పోలీసులు, అధికారుల రాకతో శాంతించిన రెండు వర్గాలు
- ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ

చిత్తూరు, అక్టోబరు 13: చిత్తూరు నగరంలోని చర్చి వీధిలో ఉన్న పాత భవనాన్ని ఓ స్వీట్ స్టాల్ యజమాని కూల్చడానికి యత్నించారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఎలా కూలుస్తారంటూ టూరిజం డైరెక్టర్ కటారి హేమలత పనులను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం చర్చి వీధిలోని తేజ స్వీట్ స్టాల్ యజమాని రవి తన స్టాల్‌కు ఎదురుగా ఉన్న పాత భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో పడగొట్టే పనిని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కటారి హేమలత తన అనుచరులతో అక్కడికి చేరుకుని, తమకు అగ్రిమెంట్ ఉందని పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఈ సమయంలో కొందరు ఆకతాయిలు వన్‌టౌన్ సీఐ జయరామయ్య పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు కూడా వచ్చి పోలీసులతో చర్చించారు. పరిస్థితి చేయి దాటకుండా చేసేందుకు డీఎస్పీ సాయినాథ్, ఆర్డీవో శ్రీనివాసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఈ భవనం విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా.. పనులెలా చేస్తారని హేమలత ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్‌సహా అన్నిరకాల అనుమతులు ఉండడంతోనే కూలగొట్టే పనులు చేపట్టానని స్వీట్ స్టాల్ యజమాని అధికారులకు వివరించారు. మరోవైపు సంఘటనా స్థలం వద్ద పెద్దఎత్తున జనం గుమికూడడంతో.. ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చర్చి వీధిని బ్లాక్ చేయడంతోపాటు పనులు ఆపేయించి, ఎక్స్‌కవేటర్‌ను పంపించేశారు. ఇరువర్గాల వారూ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు.

**స్థల యజమానే మోసగించాడా?**

చివరిగా జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో రెండువర్గాలూ సమావేశమయ్యాయి. పాండిచ్చేరికి చెందిన స్థల యజమాని ఒకరికి రిజిస్ట్రేషన్, మరొకరికి అగ్రిమెంటు చేసి మోసగించినట్లు గుర్తించారు. అతడిని పిలిపించి ఇరువర్గాలకు తగిన న్యాయం చేస్తామని ఎమ్మెల్యే సర్దుబాటు చేసినట్లు సమాచారం.

## 16న పీసీఆర్‌లో ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 13: చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి సయ్యద్ మౌల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన నాన్ మ్యాథ్స్ గ్రూపు (సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్)లో 75 శాతం విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో అసోసియేట్ రోల్స్‌లో అవకాశం ఉందన్నారు. ఏడాదిలో మూడు నెలల శిక్షణ, తొమ్మిది నెలల ఇంటర్న్‌షిప్ అనంతరం హెచ్‌సీఎల్‌లో వార్షిక వేతనం రూ.1.70 లక్షల కింద ఉద్యోగం లభిస్తోందన్నారు. ఇతర వివరాలకు 63630 95030 నెంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## కారు, మినీ లారీ ఢీ : ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

బంగారుపాళ్యం, అక్టోబరు 13: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని దొరచెరువు సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన మల్లికార్జున్ రెడ్డి తన కుటుంబీకులతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనార్థం బయల్దేరారు. మార్గమధ్యంలోని మొగిలి ఘాట్‌లో చిత్తూరు వెళ్తున్న మినీ లారీని వెనుక వైపునుంచి వీరు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని మల్లికార్జున్‌రెడ్డి స్వల్పంగా, ప్రవల్లిక అనే చిన్నారికి తీవ్రంగా గాయపడడంతో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం వేలూరు నరువి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి దుర్మరణం



ఖాదర్‌బాషా మృతదేహం

గంగవరం, అక్టోబరు 13 : గంగవరం మండలం నాలుగురోడ్ల సర్కిల్ సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరుకు చెందిన ఖాదర్‌బాషా కారులో నాలుగు రోడ్ల సర్కిల్ వద్దకు సొంతపని నిమిత్తం చేరుకున్నాడు. టీ తాగాలని బాలాజి భవన్ ఎదురుగా ఆపోజిట్ సైడ్‌లో కారు పార్క్ చేశాడు. టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా, బెంగళూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీకొనడంతో ఖాదర్‌బాషాకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలం చేరుకొని పరిశీలించగా, తలకు తీవ్రగాయాలై అప్పటికే మృతిచెందాడని 108 సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

## జిల్లాలో మోస్తరు వాన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13: జిల్లాలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా.. రామకుప్పంలో 18.2, తవణంపల్లెలో 14.6, శాంతిపురంలో 7.4, పూతలపట్టులో 3.4, బంగారుపాళ్యంలో 2.2, వి.కోటలో 2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 15 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. మండలాల వారీగా.. శ్రీరంగరాజపురంలో 28.4, గుడిపాలలో 11.2, రామకుప్పంలో 10.2, తవణంపల్లెలో 8.8, పాలసముద్రంలో 8.2, నదుంలో 7.2, సోమలలో 6.8, గంగాధరనెల్లూరులో 6.4, పెనుమూరులో 5.8, యాదమరిలో 5, చిత్తూరులో 4.6, వికోటలో 3.6, శాంతిపురంలో 1.2, బంగారుపాళ్యంలో 1, పూతలపట్టులో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

## వైభవంగా 'భాగ్ సవారి'



పొగడ చెట్టు వద్ద పూజలు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం 'భాగ్ సవారి' ఉత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల మరుసటి రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. పురాణాల ప్రకారం.. స్వామి భక్తుడైన అనంతాళ్వారు భక్తిని పరీక్షించడానికి శ్రీదేవి సమేతంగా స్వామివారు అనంతాళ్వారు పూదోటకు మానవరూపంలో వెళతారు. తన పూదోటలో పూలు కోస్తున్న అమ్మవారిని అనంతాళ్వారు అశ్వత్థ వృక్షానికి బంధిస్తాడు. స్వామిని పట్టుకోబోగా అప్రదక్షిణ దిశలో ఆలయంలోకి పారిపోయి మాయమైపోతారు. తన భక్తిని పరీక్షించడానికి వచ్చింది స్వామివారేనని అనంతాళ్వారు గ్రహించి పశ్చాత్తాపపడతాడు. వెంటనే అమ్మవారిని బందీ నుంచి విముక్తురాలిని చేసి, పూలబుట్టలో కూర్చోబెట్టి స్వామి చెంతకు చేరుస్తారు. అతడి కోరిక మేరకు బ్రహ్మోత్సవాల మరుసటి రోజు అనంతాళ్వారు తోటకు అప్రదక్షణగా వచ్చి తిరిగి ఆలయంలోకి ప్రవేశిస్తానని స్వామివారు అభయమిచ్చారు. అందులో భాగంగా నిర్వహించే భాగ్‌సవారి ఉత్సవం కోసం ఆదివారం సాయంత్రం 4 గంటలకు వైభవోత్సవ మండపం నుంచి స్వామివారు బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు అందుకున్నారు. అంతకుముందు అనంతాళ్వారు వంశీకులు నాళాయరా దివ్య ప్రబంధం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు హిమత్‌గిరి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపట్టులో అపచారం

- గ్రామదేవత విగ్రహం చేతులు విరిచేసిన నిందితుడు
- ప్రభుత్వ టీచరుపై గ్రామస్తుల ఫిర్యాదు



విరిగిన గ్రామదేవత ఎల్లమ్మ చేయి

తిరుచానూరు, అక్టోబరు 13: తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టులో గ్రామదేవత ఎల్లమ్మ విగ్రహం చేతులను విరగ్గొట్టారు. మరో విగ్రహాన్ని పెకలించారు. శనివారం వేకువజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు ప్రభుత టీచరుపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణపట్టులో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎల్లమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని పాతూరు, దిగువూరు, బ్రాహ్మణపట్టులో రోజూ ఊరేగించారు. ఊరేగింపు ముగిశాక ఆలయంలో ఉంచుతారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా రొంపిచర్లలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న.. పాతూరుకు చెందిన మోహన్‌రెడ్డి శనివారం వేకువజామున మద్యం మత్తులో ఆలయ గేటు తొలగించి, విగ్రహం రెండు చేతులు విరగ్గొట్టాడని, అక్కడే ప్రతిష్ఠించిన గ్రామదేవత విగ్రహాన్ని పెకలించాడని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు తిరుచానూరు పోలీసులకూ సమాచారం ఇచ్చారు. దీంతో వారు మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో వదిలేసినట్లు తెలిసింది.

## ఆర్టీసీకి బ్రహ్మోత్సవాల రాబడి రూ.8.7కోట్లు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 13: శ్రీవారి బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల్లో ఆర్టీసీ బస్సుల ద్వారా 10,77,273 మంది తిరుమలకు రాకపోకలు సాగించారు. ఆర్టీసీ గణాంకాల ప్రకారం గతంలో ఎన్నడూ ఇంత సంఖ్య నమోదు కాలేదు. 404 బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 17,233 ట్రిప్పులతో 4,71,914మంది, తిరుమల నుంచి తిరుపతికి 17,295 ట్రిప్పులలో 6,05,359మంది ప్రయాణించారు. 31 ఆక్యుపెన్సీ రేషియోతో రికార్డు స్థాయిలో రూ.8.7కోట్లు సమకూరినట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు.

## భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

గంగమ్మ ఆలయానికి ఐఎస్‌వో సర్టిఫికెట్




అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, అక్టోబరు 13: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. కాగా బోయకొండ గంగమ్మ దేవస్థానం నాణ్యత, భద్రత, తదితరాలను గుర్తించి ఆలయానికి ఐసీఎల్ సంస్థ ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు ఈవో తెలిపారు. ఆ సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి ఈ సర్టిఫికెట్‌ను అందించినట్లు చెప్పారు.

## మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా శమీపూజ



మరగదాంబికకు ఊరేగింపు నిర్వహిస్తున్న ఉభయదారుడు మోహన్‌రెడ్డి, గ్రామస్తులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 13: కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి శమీ పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మణికంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న జమ్మిచెట్టుకు శమీ పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అగరంపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కాణిపాకం పుర వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్

## బురదలో కూరుకుపోయిన అంబులెన్స్

- ఇబ్బంది పడిన పేషెంట్




బురదలో కూరుకుపోయిన అంబులెన్స్, మరమ్మతుల కోసం మూసి ఉంచిన ప్రధాన గేటు

చిత్తూరు సిటీ, అక్టోబరు 13: చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వద్ద అంబులెన్స్ బురదలో కూరుకుపోయింది. దీంతో అందులో ఉన్న పేషెంట్ అర్ధగంటపాటు వైద్యం అందక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ వైద్యశాల ప్రధాన గేటువద్ద ఉన్న క్యాటిల్ ట్రాప్ పాడవడంతో మరమ్మతులకోసం ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేశారు. తేనెబండకు వెళ్లే మార్గంలో ఈ గేటువుంది. కాగా ఇక్కడ సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో రోడ్డు బురదమయంగా తయారైంది. ఆదివారం పేషెంట్‌తో వచ్చిన అంబులెన్స్ ఇక్కడ ఇరుక్కుపోయింది. సుమారు అర్ధగంటపాటు అంబులెన్స్ ముందుకు, వెనుకకూ కదులుతుండటంతో లోపలున్న పేషెంట్ ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా తయారైంది. ఇక్కడ మొరం మట్టి (గట్టి మట్టి)తో రోడ్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు, రోగుల బంధువులు కోరుతున్నారు.

## చింతలగుంట కాలనీలో జల్లికట్టు

వెదురుకుప్పం, అక్టోబరు 13: వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ చింతలగుంట కాలనీలో ఆదివారం జల్లికట్టు జరిగింది. ముందస్తు సమాచారం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి గిత్తలను తీసుకొచ్చారు. వీక్షించడానికి జనం తరలివచ్చారు. అల్లెని ఏర్పాటు చేశారు. గిత్తలను అలంకరించి, కొమ్ములకు వివిధ రకాల పటీలను కట్టి అల్లివైపు వదిలారు. ఆసక్తి యువకులు గిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. గిత్తల నుంచి పటీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొడుతూ వెళ్లారు. గిత్తల కింద పడ్డ కొందరు స్వల్పగాయాలకు గురయ్యారు. తెలుగుదేశం పార్టీ జెండాలతో వెళ్లిన గిత్తలు ఆకర్షణీయంగా కనిపించాయి. జల్లికట్టు నిర్వహణతో ఆ గ్రామంలో జనసందడి ఏర్పడింది.




టీడీపీ జెండాలతో పరుగులిడుతున్న గిత్తలు, అల్లెలో గిత్తలను నిలువరిస్తున్న యువకులు

## ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 'డీఎస్సీ' ఉచిత శిక్షణ

చిత్తూరు, అక్టోబరు 13: డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగిన అభ్యర్థుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు ఉండాలన్నారు. ఈనెల 21వ తేదీలోపు www.jnanabhumi.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 27న స్క్రీనింగ్ టెస్టు ఉంటుందన్నారు. మెరిట్ జాబితా ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజన, వసతి సదుపాయాన్ని ప్రభుత్వమే కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బంగారం పేరుతో కుచ్చుటోపి

- రూ.7లక్షలు తీసుకుని ఉడాయించిన ముఠా

గంగవరం, అక్టోబరు 13: బంగారం పేరుతో నమ్మించి రూ.7లక్షలు తీసుకొని ఓ ముఠా ఉడాయించిన ఘటన గంగవరం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలకుప్పం గ్రామానికి చెందిన శేషయ్యకు కొందరు పరిచయమయ్యారు. మాటామాటా కలుపుతూ తమకు బంగారు నిధులు దొరికాయని, ఎవరైనా ఉంటే తక్కువ ధరకు అమ్మేస్తామని నమ్మించారు. తనకే బంగారు కావాలంటూ శేషయ్య వారికి చెప్పడంతో, రెండు ఒరిజినల్ బంగారు నాణేలను తీసుకొచ్చి ఇచ్చారు. శేషయ్య నాణేలను తీసుకొని ఆచారి వద్దకు తీసుకెళ్లి పరీక్షించగా, నిజమైన బంగారం అని తేలింది. దీంతో అదృష్టం కలిసివచ్చిందని సంబరపడి, తన దగ్గర రూ.7 లక్షలు ఉన్నాయని, ఈ డబ్బుకు సరిపడా బంగారు తీసుకురమ్మని సూచించారు. దీంతో శనివారం ఆ ముఠా సభ్యులు నలుగురు శేషయ్య ఇంటి వద్దకు వచ్చి రూ.7 లక్షలు తీసుకొని, బంగారు నాణేలు కారులో ఉన్నాయని, కారు రోడ్డు పక్కన పెట్టి వచ్చామని, ఇప్పుడే కారులో ఉన్న బంగారం తీసుకొచ్చి మీకు ఇస్తాము ఇక్కడే ఉండండి అని నమ్మించారు. డబ్బుతీసుకుపోయిన ముఠా సభ్యులు ఎంతసేపటికి నాణేలు తీసుకొని రాకపోవడంతో, శేషయ్యకు అనుమానం వచ్చి రోడ్డువద్దకెళ్లి చూడగా కారు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా వారి ఆచూకీ తెలియకపోవడంతో మోసపోయామని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

## లారీ టైరు పేలి వ్యాపించిన మంటలు



లారీ టైరు పేలడంతో మంటలు

పుంగనూరు రూరల్, అక్టోబరు 13: లారీ టైరు పేలడంతో మంటలు వ్యాపించి లారీ పాక్షికంగా దగ్ధమైన ఘటన ఆదివారం పుంగనూరు వద్ద చోటుచేసుకుంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు .... పుంగనూరు భగత్‌సింగ్‌కాలనీ సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద మదనపల్లె నుంచి తమిళనాడు గుడియాత్తంకు కోళ్ల ఆహార పదార్థాలను తీసుకెళుతున్న లారీ వెనుక టైరు పేలి మంటలు రావడంతో గుర్తించిన డ్రైవర్ లారీని పక్కన నిలిపాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. వెనుక ఎడమవైపు నాలుగుటైర్లు, లారీ బాడీ, ఫీడు పాక్షికంగా కాలిపోవడంతో దాదాపు రూ. 3లక్షల నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కల్లూరు, అక్టోబరు13: కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకే చోట చేరడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. వారి జీవిత స్థితిగతులు పంచుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు జయరత్నమ్మ, నటరాజను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాలిక్, చంద్రశేఖర్‌రెడ్డి, గోపి, వేణుగోపాల్‌నాయుడు, విజయకుమార్, సుజాత, సంజుతబాను, శాంతి, మహమ్మద్ రఫి, మునిరాజారెడ్డి, మునిగంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షల్లో కేడీసీ ప్రభంజనం



కుప్పం, అక్టోబరు 13: ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు కళాశాల ఛైర్‌పర్సన్ శాంతానాగరాజ్ తెలిపారు. బీకామ్. (సీఏ)లో పి.వర్షిక 93 పాయింట్లు, బీఎస్సీ (ఎంపీసీఎస్)లో జి.భవాని 9.28, బీబీఏలో ఎం.రాకేశ్ 8.97, బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్)లో ఆర్.భువనేశ్వరి 8.78, బీఎస్సీ (బీజడ్సీ)లో ఎం.రేఖ 8.49 పాయింట్లతో కళాశాలలో మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్‌లో 6 మంది విద్యార్థులు 10కి 10 పాయింట్లు సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధజంచిన విద్యార్థులను ఛైర్మన్ శాంతానాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.



● **ఐఆర్ఎం కళాశాలలో:** ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో కుప్పంలోని ఐఆర్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లతో అత్యుమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. బీ.కామ్. (సీఏ)లో ఎస్.తులసి 9.19 పాయింట్లు, బీబీఏలో ఎస్‌హీనాకౌర్ 8.97, బీఎస్సీలో కె.త్రిష 8.23 పాయింట్లు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్.మనీషా, పి.సూర్యకళ, ఇ.పవిత్ర, ఎస్.శ్వేత, ఎస్.జీవిత, ఎ.సుమియ తబస్సుమ్, ఎం.ఆసిన్‌తేజ్‌లు కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. వీరందరినీ కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధితోపాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## జగమర్ల సచివాలయం దారి మూసివేత



దారికి అడ్డంగా వేసిన కంచెను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు, అక్టోబరు13 : పలమనేరు మండలం జగమర్ల సచివాలయానికి వెళ్లే దారిని భూమి యజమాని కంచెవేసి మూసి వేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవనం నిర్మించారు. అప్పట్లో ఆ భవనం నిర్మించేందుకు రైతు నరసింహారెడ్డి స్థలం ఇచ్చారు. సమీప పొలానికి వెళ్లేందుకు కూడా సచివాలయ భవనం ముందే వెళ్లేవారు. అయితే ఇటీవల అటువైపు నరసింహారెడ్డి వెళ్లకూడదని కొందరు ఆంక్షలు పెట్టడంతో తన భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని కంచె వేసినట్లు తెలిసింది. దీనిపై సచివాలయ సిబ్బందిని విచారించగా ఈ సమస్యను తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ ఖాదర్‌బాషాను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

## జిల్లా మహాసభలను విజయవంతం చేయండి




పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు, అక్టోబరు13 : చిత్తూరులో ఈనెల 26, 27 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పలమనేరులో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక సమస్యలపై పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, భువనేశ్వరి, ఈశ్వరయ్య, ధనలక్ష్మి, సంజయ్, అంజి తదితురులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



కుప్పం,అక్టోబరు13:విజయవాడ వరద బాధితులకు శనివారం కుప్పం సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు 250 కుటుంబాలకు బియ్యం, వంట సామగ్రి, మరో 200 కుటుంబాలకు నూతన వస్త్రాలు, చీరలు, రెడీమేడ్ దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. విజయవాడ నియోజకవర్గ పరిధిలోని సుందరయ్య కట్ట, ఎల్‌బీఎస్ నగర్, ప్రకాశ్ నగర్ ప్రాంతాలలో ఈ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో సాయివతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు, పునీత్ అంజన్, ప్రసాద్, అశ్వత్, రమేశ్ పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు13: పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని డీఎస్పీ ప్రభాకర్‌ను ఆదివారం అఖిలభారత గోరక్ష జాతీయ కార్యదర్శి, బీజేపీ నాయకుడు పి.అయుబ్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ చేయరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా పుంగనూరు నుంచి గోవులు, లేగదూడలు గోవధకు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం దాదాపు 15వేల గోవులను కబేళాలకు తరలిస్తున్నారని, అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. గోవధకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. బీజేపీ నాయకులు నరసింహులు, నాగరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## 16లోపు టపాకాయల విక్రయదారులు దరఖాస్తు చేసుకోవాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు13: టపాకాయలు విక్రయించే దుకాణదారులు అనుమతి కోసం ఈనెల 16తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కోరారు. పోలీసు స్టేషన్లలో పోలీసు కేసులు ఉంటే క్లియరెన్స్ సర్టిఫికెట్ సమర్పించాల్సి వుందన్నారు.

## నేడే చిత్తూరులో మద్యం దుకాణాల ఎంపికకు లాటరీ

పుంగనూరు, అక్టోబరు13: ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి దుకాణాలు కేటాయించడానికి సోమవారం చిత్తూరు సమీపంలోని కాణిపాకం రోడ్డు సంతపేట ఆర్‌ఆర్ గార్డెన్స్ వద్ద లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మద్యంషాపులకు దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 7గంటలకు ఆర్‌ఆర్‌గార్డెన్స్ వద్దకు చేరుకోవాల్సివుందన్నారు.

## నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం,అక్టోబరు13:కుప్పం మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటదాకా జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి వినతులు స్వీకరించి, పరిష్కారాలు చూపించనున్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడా పీడీ ప్రజలను కోరారు.

## పుట్టపర్తి శిల్పారామంలో చిన్నారుల ప్రతిభ



బైరెడ్డిపల్లె, అక్టోబరు 13 : దసరా సందర్భంగా శనివారం రాత్రి పుట్టపర్తిలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బైరెడ్డిపల్లె కళాతరంగిణిసంస్థ చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ, జానపదనృత్యాలతో అలరించిన చిన్నారులు లహరి, రమ్య, భానుశ్రీ, భరత్, మధుశ్రీ, చిత్ర, పావని, చరిత, చరణ్ తదితరులను ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి అభినందించి జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు.

## సోమల హైస్కూల్ అభివృద్ధికి విరాళం

సోమల, అక్టోబరు 13: సోమల హైస్కూల్‌లో 1981-82 పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం రూ. 60 వేలు నగదును హెచ్‌ఎం హరినాథ్‌కు విరాళంగా అందజేశారు. ఇటీవల పూర్వ విద్యార్థులు స్థానిక హైస్కూల్‌లో గెట్ టూ గెదెర్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్‌కు, మరి కొన్ని పనులకు నిధులు అందజేస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షకీల్, జీసీకే ప్రసాద్, రమాపతి, ఉమాశంకర్, రాంమోహన్, విజయలక్ష్మి, వసంతకుమారి, కోదండ, జనార్ధన్, రాజేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పలమనేరు, అక్టోబరు13 : ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీకి ప్రిపేర్ అయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 3నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పలమనేరు సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి బి. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో అర్హత సాధించడంతోపాటు ఏడాదికి రూ. 2.5 లక్షల ఆదాయంలోపు ఉండాలన్నారు. అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 27న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించిన అనంతరం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని, శిక్షణ పొందేవారికి ఉచిత వసతి, భోజనం కల్పిస్తామన్నారు.

**పుంగనూరు రూరల్ :** అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ యువతీ యువకులు ఉచిత డీఎస్సీ శిక్షణకు ఈనెల 21తేదీ లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పుంగనూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నరసింహులు కోరారు. ఈ అవకాశాన్ని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

సోమల, అక్టోబరు 13: సోమల బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం గొల్లపల్లెకు చెందిన పెంచులయ్య, తాయారమ్మలు ద్విచక్రవాహనంలో తిరుపతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా సోమల బోయకొండ గంగమ్మ ఆలయం మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. ఈక్రమంలో తాయారమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని పుంగనూరు వైద్యశాలకు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ఆటో ఢీకొన్న ప్రమాదంలో రోడ్డుపై పడిన క్షతగాత్రులు

వి.కోట, అక్టోబరు13: వి.కోట-ముదరందొడ్డి మార్గంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గోనుమాకులపల్లెకు చెందిన శ్రీనివాసులు, శోభన్ బాబు ద్విచక్ర వాహనంలో పల్లికుప్పం వెళ్లి తిరిగి వస్తుండగా ఆళ్ళవారిపల్లె సమీపంలో ఆటో ప్రమాదవశాత్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడ్డారు. గమనించిన స్థానికులు వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆపై వీరిని కుప్పం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యల్లమ్మ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



కల్లూరు, అక్టోబరు13: పులిచెర్ల సమీపంలోని కల్లూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన యల్లమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ ధర్మకర్త మురళీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఉదయం గంగస్వీకరణ, గణపతి పూజ, ప్రత్యేకహోమం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభానికి విశేషపూజలు నిర్వహించారు.

## రాజరాజేశ్వరిగా సల్లాపురెమ్మ



బైరెడ్డిపల్లె, అక్టోబరు 13 : స్థానిక సల్లాపురెమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బాటగంగమ్మ ఆలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, గడ్డూరు సల్లాపురెమ్మ ఆలయం, దేవదొడ్డి అంకాళపరమేశ్వరి ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు.

**కల్లూరు :** కల్లూరులో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వసంతోత్సవం, శయనోత్సవం వేడుకలు నిర్వహించారు. ఆర్యవైశ్యుల వసంతోత్సవ వేడుక లు భక్తులను ఆకట్టుకున్నాయి.

## కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

రామకుప్పం, అక్టోబరు 13: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె సమీపంలో కోడిపందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. సీఐ మల్లేష్‌యాదవ్, రాళబూదుగూరు, గుడుపల్లె, వి.కోట ఎస్‌ఐలు నరేష్, శ్రీనివాసులు, బాబులు తమ సిబ్బందితో కలసి కోడిపందేల శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది పందెంరాయుళ్ళను అరెస్టు చేసి, వారి నుంచి రూ.17,650 నగదు, రెండు కోళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

# వైభవంగా ముగిసిన దేవీనవరాత్రులు



పుష్పపల్లకిపై కొలువుదీరిన దుర్గమ్మ, రాజరాజేశ్వరిదేవిగా విహరించిన అమ్మవారు

వి.కోట, అక్టోబరు 13: దేవీనవరాత్రి ఉత్సవాలు వి.కోటలో వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శనివారం చివరిరోజున దుర్గమ్మ రాజరాజేశ్వరి దేవిగా కొలువుతీరి పురవీధుల్లో విహరించారు. మంగళవాయిద్యాలు, పండరి భజనలు, డీజే నృత్యాల నడుమ పట్టణంలో అమ్మవారి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. దుర్గమ్మ ఆలయం వద్ద నుంచి వేణుగోపాలస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, ఎగువ చెక్‌పోస్టు, లాంగ్ బజారు మీదుగా దుర్గానగర్ వరకు ఊరేగింపు కొనసాగింది. ఉదయం అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకాలు, విశేష అలంకరణ చేపట్టారు. ఆపై ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై అమ్మవారిని కొలువుతీర్చి ఊరేగించారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు దంపతులు, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, ఇతర ప్రముఖులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు. కొత్తూరుకు చెందిన ఆండెప్ప, సత్య కుటుంబీకులు పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, సభ్యులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నదానం చేపట్టారు.

# ఘనంగా విజయదశమి పూజలు



ఆనిగానూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి, కంబాలదేవులపల్లెలో చౌడేశ్వరమ్మ

రామకుప్పం, అక్టోబరు 13: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విజయదశమి పూజలు ఘనంగా జరిగాయి. కంబాదేవులపల్లె సప్తమాతృక చౌడేశ్వరమ్మ ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేషఅలంకరణలు చేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. రామకుప్పం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శయనోత్సవం నిర్వహించారు. ఆనిగానూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శనీశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

# ముగిసిన దసరా ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి

పుంగనూరు రూరల్, అక్టోబరు13: పట్టణ సమీపంలోని చదళ్లలో చౌడేశ్వరీదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయదాత వేణుగోపాల్‌రెడ్డి భక్తులకు తీర్థ అన్న ప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ, భోగనంజుండేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీదేవి, చాముండేశ్వరిదేవి, వాసవీకన్యకా పరమేశ్వరిదేవి, కల్యాణ వెంకటరమణస్వామి ఆలయాల్లో దసరా ఉత్సవాలను ముగింపురోజు వైభవంగా నిర్వహించారు. నగరిలోని ప్రసన్నపార్వతిదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు లక్షకుంకుమార్చన, శమీవృక్షానికి పూజలు చేసి అమ్మవారిని ఊరేగించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి వజ్రకవచం అలంకరణలో దర్శనమిచ్చారు. కాశీవిశ్వేశ్వరస్వామి సన్నిధిలోని అన్నపూర్ణాదేవికి పాలు, పసుపు, కుంకుమ అభిషేకాలు జరిగాయి. ఆలయాల్లో హోమాలు, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మహారాష్ట్రానికి చెందిన మరాఠీలు నృత్యాలు చేస్తూ దుర్గాదేవిని ప్రత్యేక పల్లకిలో పట్టణ పురవీధుల్లో ఊరేగించి సంబరాలు చేశారు.

# పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి



పీఆర్‌సీ కమిటీ నియమించాలని నినాదాలు చేస్తున్న పెన్సనర్లు

పలమనేరు, అక్టోబరు13 : పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలమనేరులోని నార్తు పాఠశాలలో ఆదివారం పెన్షనర్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గురురాజారావు మాట్లాడుతూ 2018 జూలై నుంచి 2023 వరకు చెల్లించవలసిన 9 విడతల డీఆర్ బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కమ్యుటేషన్ కాలపరిమితిని 15 నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షనర్ల పట్ల సానుభూతితో యథావిధంగా 10 శాతం, 15 శాతం అడిషనల్ క్వాంటమ్‌ను ఆఫ్ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు కృష్ణమూర్తి, బాలసుబ్రమణ్యం, గురుస్వామినాయుడు, మోహన్, చంద్రశేఖర్, రామానాయుడు, జయకృష్ణ, ఆంజప్ప, చెంగప్ప, వెంకటేసు, భద్రమ్మ, మస్తాని, సరస్వతమ్మ, పాండురంగయ్య,రెడ్డెప్ప, చక్రపాణిశెట్టి, మురళి, చంగలయ్య, వేణుగోపాల్‌శెట్టి, ఆదంసాహెబ్, మధు, సుబ్రమణ్యం, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంకివారిపల్లెలో టీడీపీ నాయకుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, అక్టోబరు13: కల్లూరు సీఐ, ఎస్ఐ తీరుకు నిరసనగా పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె నాలుగురోడ్ల కూడలిలో శనివారం రాత్రి టీడీపీ నాయకులు రహదారిపై బైఠాయించి ధర్నాతోపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు మనికృష్ణమనాయుడు, టీడీపీ నాయకులు గోపినాయుడు, ధనంజయనాయుడు, దేవ, రవి, సురేష్, సురేంద్ర, జయచంద్రనాయుడు, చంద్రబాబు, చంగల్రాయనాయుడు మాట్లాడుతూ ఎస్ఐ వెంకటేశ్వర్లు, సీఐ సూర్యనారాయణ వాహనాలను తనిఖీ చేస్తూ గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం, సొంత ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్లను ఆపుతున్నారని, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3030 వంతున అపరాధం వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. సమాచారం తెలుసుకున్న చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. ధర్నాను వెంటనే విరమించాలని, రెండు రోజుల్లో అక్కడికే వస్తానని, మీ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని హామీ ఇవ్వడంతో వారు నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

### ● రికార్డులు లేకపోవడంతోనే ఫైన్ వేశాం

ఎల్లంకివారిపల్లె వద్ద ఇసుక ట్రాక్టర్లకు ఎలాంటి రికార్డులు చూపకపోవడంతోనే ఒక్కో ట్రాక్టర్‌కు రూ:3030 జరిమానా వేశామని కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు. వాహనంలో తప్పనిసరిగా వాహనం రికార్డులు ఉంచుకోవాలని తెలిపారు.

## ఘనంగా యల్లమ్మ తిరుణాళ్ల



సదుం, అక్టోబరు 13: తాటిగుంటపాళెం పంచాయతీ పాపిరెడ్డిగారి పల్లెలో వెలసిన గ్రామదేవత యల్లమ్మ తిరుణాళ్లను ఘనంగా నిర్వహిం చారు. అమ్మవారిని దుర్గామాతగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఇంటింటా అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు దాము, వాసు, ఈవోపీఆర్‌ఆర్‌డీ వరప్రసాద్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సాయి మందిరానికి రూ.లక్ష విరాళం



సదుం, అక్టోబరు 13: స్థానిక గాంధీ వీధిలోని షిరిడీ సాయి మందిరంలో శనివారం ఆలయ ధర్మకర్త తుమ్మల నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదానం చేశారు. అలాగే ఆలయ నిర్వహణ కార్యక్రమాలకు ధర్మకర్త నాగభూషణం రెడ్డి దంపతులు రూ.లక్ష నగదును ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు, అక్టోబరు13: తుపాను ముప్పు ఈనెల 15వ తేదీ వరకు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయసింహ ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను సమయంలో ప్రజలు బయటకు రాకూడదని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. నిత్యావసర వస్తువులు ముందుగానే సమకూర్చుకోవాలని కోరారు.

## ముగిసిన శతచండీ హోమం



అమ్మవారిని నిమజ్జనం చేస్తున్న బీసీవైపీ శ్రేణులు

పుంగనూరు, అక్టోబరు 13: గత తొమ్మిది రోజులుగా పుంగనూరులో శాస్త్రోక్తంగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీసీవైపార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ నిర్వహిస్తున్న శ్రీరుద్రసహిత శతచండీ హోమం ఆదివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. రుత్వికులచే ప్రతిరోజు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు చేపట్టారు. శమీ వృక్షం పూజను భక్తిశ్రద్ధలతో వేదపండితులు నిర్వహించి ఉదంతాన్ని వివరించారు. దుర్గ అమ్మవారిని ఉదయం స్థానిక కొత్తఇండ్లులోని రామచంద్రయాదవ్ ఇంటి నుంచి మంగళవాయిద్యాలు,కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేల్చుతూ మదనపల్లె రోడ్డులోని చెరువులో వైభవంగా నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు, బీసీవైపార్టీ శ్రేణులకు తీర్థ అన్న ప్రసాదాలు అందజేశారు.

# చిత్తూరు
## జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

### ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు


వేపంజేరి కోనేటిలో చక్రత్తాళ్వార్‌తో అర్చకులు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 13: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం ఆలయం నుంచి చక్రత్తాళ్వార్‌ను కోనేటివరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించిన తర్వాత వేదమంత్రాల నడుమ అర్చకులు కోనేటిలో చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడి విగ్రహాలకు ద్వాదశ ఆరాధన పూజలు చేశారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కె.ఎస్. వాసు, అమృతవల్లి దంపతులు, సుమిత్రా శ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా కుంభాభిషేకం


హోమం పూజల్లో పాల్గొన్న అర్చకులు, పోలు వంశస్థులు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 13: మండలంలోని క్రిష్ణంపల్లెలో నూతనంగా నిర్మించిన అంకాల పరమేశ్వరి సమేత బాల గురునాథస్వామి ఆలయ కుంభాభిషేకం పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. క్రిష్ణంపల్లె గ్రామానికి చెందిన పోలు వంశస్థుల ఆధ్వర్యంలో ఆలయం పక్కన ఏర్పాటుచేసిన శిబిరంలో స్వామి, అమ్మవార్లకు చెందిన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక హోమాలు, మహాగణపతి, నవగ్రహ స్థాపన, కలశరాధనలు, లఘుపూర్ణాహరాతి, చతుర్వేద సమర్పణ, మంగళహారతి, వేదపారాయణం, శయానాధివాసం, విశేష మంగళహారతి, అర్చకుల వేదమంత్రాలు నడుమ వైభవంగా పూజలు చేశారు. మహిళల కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. ఈపూజలకు క్రిష్ణంపల్లె గ్రామానికి చెందిన పోలు వంశస్థుల కుటుంబాలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు భారీ ఎత్తున తరలిరాగా, అన్నదానం చేశారు.

### క్రీడలతోనే మానసిక ఉల్లాసం


షీల్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, అక్టోబరు 13: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఆదివారం చిన్న తయ్యూరు గ్రామంలో గతం వారం రోజుల ముందు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, అందులో పిళ్లారికుప్పం టీం మొదటి బహుమతిగా రూ.40వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. రెండో బహుమతిని గంగాధర నెల్లూరు మండలం బుక్కపట్నం టీం గెలుచుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో కొత్త క్రికెట్ స్టేడియం నిర్మించడానికి బీసీసీఐతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని క్రీడకారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, బాలు, గుండయ్య, కుమార్, సురేష్, మహేష్, సిద్దయ్యశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


కీళపట్టులో మురుగేష్ తల్లి కుప్పమ్మకు నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

నగరి, అక్టోబరు 13: నగరి మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో రేషన్ డీలర్ మురుగేష్ తల్లి కుప్పమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. నగరి మండల పరిధిలోని ముడుపల్లిలో రవినాయుడు తల్లి పద్మావతమ్మ మృతి చెందడంతో పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, చిత్తూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిముత్తు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### టీడీపీ శ్రేణుల తిరుమల పాదయాత్ర


తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న పాలసముద్రం వాసులు

పాలసముద్రం, అక్టోబరు 13: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యినందుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో 320 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గత 8 సంవత్సరాలుగా పాలసముద్రం నుంచి చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో తిరవళ నెలలో నాల్గవ శనివారం పాదయాత్రకు తిరుమలకు వెళ్లడం ఆనవాయితీ. గత సంవత్సరం చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. గత 20 రోజులుగా గోవిందమాల వేసి భక్తి శ్రద్ధలతో తిరుమలకు వెళ్లారు.

### ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల



చిత్తూరు సిటీ, అక్టోబరు 13: నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. శనివారం స్థానిక 2వ డిపోలో రెండు నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వసంత్ కుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సి.ఆర్.రాజన్

శ్రీరంగరాజపురం, అక్టోబరు 13: మండలంలోని ఆరిమాకు పల్లె గ్రామంలోని ఆరిమాని గంగమ్మకు శనివారం చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.ఆర్.రాజన్ పట్టువస్త్రాలు సమర్పించారు. అభిషేకం ఉభయదారులుగా జగదీశ్వర్ నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, పైనేని ధనంజయులు నాయుడు, బాలు, హరిబాబు నాయుడు, శ్రీధర్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు హిమాచాలపతిరెడ్డి, సిద్దయ్యశెట్టి, జలంధర్ నాయుడు, హేమాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### వరసిద్ధుడి సేవలో జేసీ


జేసీ విద్యాధరికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 13: జేసీ విద్యాధరి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానంతరం ఆమెను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళదాతకు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 13: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆన్‌లైన్ ద్వారా చిత్తూరుకు చెందిన మోహీష్ రూ.1,01,116 శనివారం విరాళంగా అందించారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి స్వామి దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

### అదుపుతప్పి పడి స్కూటరిస్టు మృతి

విజయపురం, అక్టోబరు 13: అదుపుతప్పి కింద పడి స్కూటరిస్టు శరవణ(35) మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం కళియంబాకం సమీపంలో జరిగింది. ఎస్‌ఐ బలరాం కథనం మేరకు వివరాలు... తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా నారాయణపురం ప్రాంతానికి చెందిన శరవణ ఆ రాష్ట్రంలోని ఒక చౌకదుకాణంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. నగరి మండలం ఓజీకుప్పంలో తన అత్తగారింటికి వెళ్లేందుకు పెన్నాళూరుపేట మీదుగా కొత్తగా నిర్మాణంలో ఉన్న చిత్తూరు - తచ్చూరు రోడ్డుపై ప్రయాణిస్తూ కళియంబాకం సమీపంలో అదుపుతప్పి పడి మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### కుక్కను ఢీకొని ద్విచక్ర వాహనం బోల్తా
#### - భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

గుడిపాల, అక్టోబరు 13: చిత్తూరు - బెంగళూరు జాతీయ రహదారిలో గుడిపాల క్రాస్ వద్ద ఆదివారం ఉదయం కుక్క అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన సంఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మాపాక్షికి చెందిన చొక్కనాథం, ఆయన భార్య లక్ష్మి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలిక అదృశ్యం

యాదమరి, అక్టోబరు 13: మండలంలోని మాదిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన బాలిక (16) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదమరి ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ బాలిక శుక్రవారం ఉదయం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి, బంధువులు కలిసి వెతికినా ఆచూకీ లభించక పోవడంతో యాదమరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేలపై ఉన్న విద్యుత్ తీగలను సరి చేసిన ట్రాన్స్‌కో అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నేలపై ఉన్న విద్యుత్ తీగలను సరి చేసిన అధికారులు

పాలసముద్రం, అక్టోబరు 13: మండలంలోని పాలసముద్రం కాలనీలోని సుబ్రహ్మణ్యం అనే రైతు వ్యవసాయ భూమిలో నేలపై ఉన్న విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ వరదరాజులు, సిబ్బంది స్తంభాన్ని నాటి, తీగలను సరిచేశారు. ఈనెల 12న ఆంధ్రజ్యోతిలో నేలపైనే 11కేవీ విద్యుత్ తీగలు అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు శనివారం విద్యుత్ స్తంభం నాటి, తీగలను నేల నుంచి పైకి లాగి సమస్యను పరిష్కరించారు. దీంతోరైతులు ఆనందం వ్యక్తం చేశారు.

### జన సైనికుడి మృతి
#### - కుటుంబానికి ఆర్థికసాయం

వెదురుకుప్పం, అక్టోబరు 13: కార్వేటినగరం మండలం టీటీ కండ్రిగకు చెందిన జనసైనికుడు వడివేలు(30) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఆ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న ఆగ్రామానికి చేరుకున్నారు. వడివేలు భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి భార్య ఆశాలతకు రూ.20వేలు ఆర్థికసాయమందించారు.

### ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈగా చంద్రబాబు

వెదురుకుప్పం, అక్టోబరు 13: ఏపీఎస్పీడీసీఎల్ కార్వేటినగరం ఏడీఈగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఏఈగా పనిచేస్తూ పదోన్నతిపై కార్వేటినగరానికి వచ్చారు.

### నేటి నుంచి పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు

విజయపురం, అక్టోబరు 13: మండలంలో సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణప్రకాష్ పేర్కొన్నారు. 14న ఇళ్లత్తూరులో, విజయపురంలో, ఆలపాకంలో, కాళికాపురం బీసీ కాలనీలో, ఝూరికాపురంలో, కేవీపురంలో, గంగమాంబాపురంలో, పోతురాజులు కండ్రిగలో, తెల్లగుంట గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల కోసం భూమిపూజ చేస్తున్నట్టు తెలిపారు.






చిత్తూరులో దుర్గాంబకు పుష్పపల్లకి సేవ - సుమంగళి (గాజుల) అలంకారంలో పొన్నియమ్మ - విజయపురం మిట్టూరులో ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి - కార్వేటినగరంలో బంగారమ్మ - రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దేశమ్మ

# పుష్పపల్లకి సేవతో ముగిసిన దసరా ఉత్సవాలు
#### - విజయలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గాంబ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 13: నగరపాలక పరిధిలోని పలు ఆలయాల్లో గత 10 రోజులుగా జరుగుతున్న దసరా బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. గిరింపేట దుర్గాంబ ఆలయంలో అమ్మవారు విజయదుర్గాదేవి అలంకారంలో పుష్పపల్లకి సేవను ఈవో మునిశేఖర్, పాలకమండలి చైర్మన్ దిలీప్‌రెడ్డిలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని వసంతాల వేడుకతో పురవీధుల్లో ఊరేగించారు. సంతపేట కనకదుర్గ విజయదుర్గగా, శివగాయి సుందరి చిదంబరేశ్వర ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా, పొన్నియమ్మ సుమంగళిగా, కట్టమంచి విశ్వసాయి షిరిడి సాయిబాబ, గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి, బ్రాహ్మణ వీధి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల ఆలయాల్లో రాజరాజేశ్వరి అలంకారాల్లో దర్శనమిచ్చారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో ఆనందవల్లి ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో, జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో, విజయపురం మిట్టూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో తదితర ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. జగన్నాథపురంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పురోహితులు బాలసుబ్రహ్మణ్యశర్మ, రాంప్రసాద్‌శర్మ, వందవాసి మహేష్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మ, పాత దేరాకండ్రిగలోని నైనేరమ్మ, వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నగరి: నగరి పట్టణం, నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. దేశమ్మ దేవాలయం, ఓంశక్తి ఆలయం, సత్రవాడలోని కరియమాణిక్యస్వామి ఆలయం, పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

### మహా పూర్ణాహుతితో ముగిసిన నవచండీ యాగం


పూర్ణాహుతి చేస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 13: స్థానిక జీజేఎం ఫంక్షన్ హాల్‌లో గత 10 రోజులుగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవచండీ యాగం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అష్ట దిక్పాలికులకు, సప్తఋషులకు ప్రత్యేక పూజలు చేసి, ప్రజలు సుభిక్షంగా జీవించాలని కోరుతూ నవ చండీమాతలను ప్రార్థించి, మహా పూర్ణాహుతితో యాగం పరిసమాప్తం గావించారు. ఋత్వికులు, వేదపండితులను ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వసంత నాయుడు, రాజేష్‌కుమార్‌రెడ్డి, చెన్నకేశవులు నాయుడు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని ఇరువారం బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో శ్రీనివాస ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో డి.ఎ.శ్రీనివాస్, డి.కె.బద్రీనారాయణ, రంగనాథం, హరి రంగనాథం, రాజేంద్రప్రసాద్, నగర బలిజ సేవాసంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


చండీ యాగంలో పూజలు చేస్తున్న డి.ఎ.శ్రీనివాస్ తదితరులు

### గంటా మోహన్ సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు, అక్టోబరు 13: ఎస్టీయూ రాష్ట్ర నేత గంటా మోహన్ సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం, హక్కుల కోసం పోరాటం చేస్తున్న గంటా మోహన్‌ను ఎలాంటి కారణాలు లేకుండానే సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. గతంలో అనేకసార్లు సమస్యలపై డీఈవో వద్దకు వెళ్లగా సరిగ్గా స్పందించ లేదన్నారు. గంటా మోహన్ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముందు దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఇప్పటికైనా గంటా మోహన్ సస్పెన్షన్ ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నేతలు దామోదరం, మణికంఠ, వినాయక, ఈశ్వరన్, రమాదేవి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

### భావ విప్లవ సాహిత్యానికి ఆదర్శనీయుడు త్రిపురనేని


స్మారకోపన్యాసం చేస్తున్న హరి నాయుడు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 13: సమాజంలోని మూఢచారాలు, నమ్మకాలు, వివాహ వ్యవస్థలు, విగ్రహారాధనల పట్ల తన భావ సాహిత్యంతో సమాజాన్ని నిలదీసిన ఆదర్శనీయుడు మహాకవి త్రిపురనేని రామస్వామి అని ప్రముఖ రచయిత, సాహితి విమర్శకులు హరి నాయుడు తెలిపారు. శనివారం గిరింపేట ప్రభుత్వ మ్యాంగో భవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితి స్రవంతి కార్యక్రమంలో సాహితివేత్త త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారకోపన్యాసాన్ని హరి నాయుడు చేశారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, గిరిధరన్, సహదేవ నాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగరంలోని కళాకారులు, సాహితివేత్తలు పాల్గొన్నారు.

### క్రికెట్ విజేత లయన్ బాయ్స్


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు నిర్వాహకులు

బంగారుపాళ్యం, అక్టోబరు 13: బంగారుపాళ్యం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో దసరా సెలవులను పురస్కరించుకుని ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు ఆధ్వర్యంలో గత 10 రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో జిల్లా నలమూలల నుంచి 25 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం బంగారుపాళ్యం లయన్ బాయ్స్ జట్టు, ఆండారెడ్డిపల్లి థండర్ బాయ్స్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో మ్యాచ్‌లో లయన్ బాయ్స్ జట్టు విజేత నిలిచి మొదటి బహుమతిగా రూ.25 వేలు కెప్టెన్ గౌస్‌బాషా అందుకున్నారు. రెండో బహుమతిని థండర్ బాయ్స్ జట్టు కైవసం చేసుకోగా, కెప్టెన్ అనిల్‌కు రూ.15వేలు అందించారు. గెలుపొందిన వారికి ట్రస్టు నిర్వాహకులు ఈశ్వర్ నాయుడు, కళ్యాణ్‌ల చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హేమచంద్ర నాయుడు, సూరి, చెన్నకేశవులు, మధుసూదన్ నాయుడు, బుజ్జి, నరేష్, ప్రకాష్, ఏకాంబరం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, అక్టోబరు 13: వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

### చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 13: స్థానిక మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వరాలయంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న దసరా బ్రహ్మోత్సవాలు శనివారం చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగిశాయి. స్వామివారి చక్రస్నాన కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ డి.ఎ.శ్రీనివాస్, డి.కె.బద్రీనారాయణలు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. స్థానిక కోదండరామాలయంలో శనివారం స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్‌లు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### వాహన పూజకు అధిక సంఖ్యలో భక్తులు



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 13: విజయ దశమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శనివారం వాహన పూజలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. వందల సంఖ్యలో భక్తులు వాహన పూజ మండపం వద్ద బారులు తీరారు. ఆలయ సిబ్బంది అన్ని వాహనాలకు పూజలు నిర్వహించారు.

### తిరుపతి గంగమ్మకు పొంగళ్లు

వెదురుకుప్పం, అక్టోబరు 13: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం దాసరికాలనీలో ఉన్న తిరుపతి గంగమ్మకు ఆదివారం పొంగళ్లు పెట్టారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

### ఆలయాలకు స్వయం ప్రతిపత్తి హర్షణీయం


నారా లోకేశ్‌ను కల్సిన రామభద్ర

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13: వైదిక ఆగమ అంశాల్లో ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని జిల్లా బ్రాహ్మణ సంఘ కార్యదర్శి ఎంజీ రామభద్ర తెలిపారు. ఆదివారం ఆయన అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి జిల్లా బ్రాహ్మణులందరి తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేదవిద్య అభ్యసించిన యువతకు యువనేస్తం కింద రూ.3 వేలు కూటమి ప్రభుత్వం అందిస్తోందని, దీనిని అర్హత కల్గిన బ్రాహ్మణ యువత సద్వినియోగం చేసుకోవాలని లోకేశ్ సూచించారు. త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి హామీ యిచ్చారు.

### నైనేరమ్మకు ప్రత్యేక పూజలు


నైనేరమ్మ ఆలయంలో తులాభారం వేస్తున్న భక్తులు

వెదురుకుప్పం, అక్టోబరు 13: కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలోని నైనేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మండలంలోని ద్వారకనగరానికి చెందిన శ్రీనివాసులు, జ్యోతి దంపతులు తమ ఇద్దరు పిల్లలకు తులాభారం వేశారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన కార్యనిర్వాహకులు ఆనంద్, గీత, భాస్కర్, బొబ్బిలిరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులను ఆదుకోవడమే లక్ష్యం


వీల్‌చైర్‌ను అందిస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, అక్టోబరు 13: దివ్యాంగులను ఆదుకోవడమే ఏకైక లక్ష్యమని జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న అన్నారు. ఆదివారం మండలంలోని చౌడేపల్లికి చెందిన దివ్యాంగుడైన వినోద్‌కుమార్‌ను పరామర్శించారు. అతడికి వీల్‌చైర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వెదురుకుప్పం మండలాధ్యక్షుడు పురుషోత్తం, నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్‌రెడ్డి, యువజన మండలాధ్యక్షుడు కావలి సతీష్, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ పాల్గొన్నారు.

### కమనీయంగా వెంకటేశ్వరుడి కల్యాణం


కోదండరామాలయంలో కృష్ణావతారంలో మహావిష్ణువు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 13: నగరపాలక పరిధిలోని కట్టమంచి శాంత రఘురామన్ కల్యాణ మండపంలో పెరటాసి మాసం చివరి శనివారం సందర్భంగా తరిగొండ వెంగమాంబ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వర చౌదరి, బీవీ రెడ్డి స్కూల్ సౌమినిరెడ్డి, పార్థసారథి నాయుడు, దొరబాబు, భూపేష్ గోపీనాథ్, కాశీ నాయకర్, ఈశ్వర్, ఎల్‌జి తిరుకుమరన్, నళని, వేలు పాల్గొన్నారు.